క్లుప్తంగా

రూ.1,40,800 ఆర్థికసాయం



సాయికుమార్ తల్లికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు, గ్రామస్తులు

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ పరిధి మాకివలస గ్రామానికి చెందిన నక్క సాయికుమార్ (23) ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానికులు, స్నేహితులు కలిసి మంగళవారం రూ.1,40,800లను సాయికుమార్ తల్లికి అందజేశారు.

140 మందికి వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న సత్య సాయి సేవా సమితి సభ్యులు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో మంగళవారం సత్యసాయి సమితి సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది 140 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. జెమ్స్ వైద్య సిబ్బంది, సత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వయోడెక్ట్ పరిశీలన



వయోడెక్ట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయి ప్రత్యూష

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని నాలుగో వార్డు పరిధిలో ఉన్న బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ వయోడెక్ట్‌ను శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష మంగళవారం పరిశీలించారు. ఇటీవల పత్రికల్లో తరచూ వయోడాక్ట్ నుంచి ప్రవహిస్తున్న సాగునీటి లీకులపై వార్తలు వస్తున్నాయి. ఏ క్షణాన కూలుతుందోనని వాహనదారులు, ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వయోడాక్ట్‌ను ఆర్డీఓ పరిశీలించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. సాగునీరు లీకు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ పప్పల గోవిందరావు, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని శ్రావణ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. భక్తులు హారుతులిచ్చారు. అర్చకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: ఈ నెల 20వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతి హేమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ విభాగంలో కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, బోటనీ, జువాలజీ, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏలో ఎకానమిక్స్, పొలిటికల్ సైన్స్, తదితర కోర్సుల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలకు వచ్చి నేరుగా, కళాశాల వెబ్‌సైట్ ద్వారా చేరవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 9441279592, 9346444595 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆమదాలవలస డిగ్రీ కళాశాలలో..

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బుధవారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్.స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ హిస్టరీ 40, బీఏ పాలిటిక్స్ 40, బీకాం కంప్యూటర్స్‌లో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్ మార్కుల లిస్ట్, టీసీ, ఆరో తరగతి నుంచి స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు తీసుకువచ్చి కళాశాలలో పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన ఉంటుందన్నారు.

దివ్యాంగులపై కూటమి కుట్ర..!

- అనర్హత పేరుతో పింఛన్ల కోత
- లబోదిబోమంటున్న బాధితులు
- అర్హత ఉన్నా తొలగిస్తున్నారని ఆవేదన
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న దివ్యాంగులు



సారవకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల ఏరివేత కార్యక్రమం చేపట్టింది. దీంట్లో భాగంగా అనర్హత పేరుతో దివ్యాంగ పింఛన్లు తొలగించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట మండలాల్లో సుమారు 720 మంది దివ్యాంగుల పింఛన్లకు కూటమి ప్రభుత్వం కోత విధించింది. ఇప్పటివరకు వస్తున్న దివ్యాంగ పింఛన్‌ను సెప్టెంబర్ నుంచి నిలుపుదల చేయడం జరుగుతుందని కొద్దిరోజుల క్రితం సంబంధిత సచివాలయాల నుంచి పలువురికి సమాచారం అందించింది. దీంతో టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు దివ్యాంగత్వ నిరూపణకు సంబంధించిన ధ్రువపత్రాల కోసం పరుగులు తీసుకున్నారు.

రీ వెరిఫికేషన్ పాట్లు..

దివ్యాంగ పింఛన్లు ఉన్న వారందరికీ గతంలో టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళంలో గల

నరసన్నపేటలో నియోజకవర్గంలో దివ్యాంగ తొలగించిన పింఛన్ల వివరాలు..

మండలం	రీ వెరిఫికేషన్ చేసినవి	నోటీసులు జారీ చేసినవి
సారవకోట	449	108
నరసన్నపేట	492	262
పోలాకి	478	142
జలుమూరు	534	286

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ధ్రువపత్రాలను పరిశీలించారు. వాస్తవంగా ఉన్న దివ్యాంగత్వం ఎంత, ధ్రువపత్రాలలో ఎంత నమోదు చేసి ఇచ్చారనే అంశాలను అప్పట్లో తనిఖీ చేశారు. రెండు, మూడు నెలలపాటు యథావిధిగా పింఛన్‌ను చెల్లించారు. సెప్టెంబర్ నుంచి దివ్యాంగ పింఛన్ రాదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో పలువురు ఆందోళనకు గురవుతున్నారు. పింఛన్లు తొలగించిన వారిలో నిరుపేదలు, ఎటువంటి పనులు చేయలేని స్థితిలో ఉన్న వారే అధికం.

2011లో ధ్రువీకరణ పత్రం మంజూరైంది



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి అలుదు పంచాయతీ వడ్డినవలస గ్రామానికి చెందిన దుబ్బ రామారావు. కుడి కాలు పాదం పూర్తిగా పాడైంది. 2011లో శ్రీకాకుళం రిమ్స్ వైద్యులు పరీక్షించి 53 శాతంతో దివ్యాంగ ధ్రువీకరణ పత్రం అందించారు. అప్పటి నుంచి పింఛన్‌ను పొందుతున్నాడు. పింఛన్‌ను రద్దు చేస్తున్నట్లు ఈ ప్రభుత్వం నోటీసు పంపించడంతో లబోదిబోమంటున్నాడు. సొంతంగా ఎటువంటి పని చేసుకోలేని పరిస్థితి. పింఛన్ డబ్బులే ఆధారం. ఇక నుంచి ఎలా బతికేదని ఆవేదన చెందుతున్నాడు.

ధ్రువపత్రాలు తీసుకురావాలి



దివ్యాంగ ధ్రువపత్రాలు మరలా వైద్యుల నుంచి తీసుకువస్తే పునః పరిశీలన చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. వారి నుంచి వచ్చే ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

– పి.మోహన్‌కుమార్, ఎంపీడీఓ, సారవకోట

నీట మునిగిన వరి పొలాలు



మెళియాపుట్టి: నీలాపురంలో చెరువును తలపిస్తున్న వరి పంట పొలాలు



నరసన్నపేట: నీటిలో ఉన్న వరి వెద పొలాలు

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీ పరిధిలోని గొట్టిపల్లి సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న 20 ఎకరాల వరి వెద పొలాలు నీట మునిగాయి. చిన్న వర్షం పడినా పొలాలు మునుగుతున్నాయని, పంటలకు నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పొలాలకు ఆనుకొని గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 119/1లో కారి చెరువు పొర్లు బట్టి పూర్తిగా ఆక్రమణలకు గురైందన్నారు. అప్పటి నుంచి పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. పది అడుగుల వెడల్పుతో కాలువ ఉండేదని, ఇప్పుడు కనుమరుగైందన్నారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏటా వరి పంట మునుగుతుందన్నారు.



మెళియాపుట్టి: వసుంధర వద్ద నీట మునిగిన వరి పంట పొలాలు

ఆందోళనలో రైతన్న

మెళియాపుట్టి: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నీలాపురం, పుష్టిలవార, పట్టుపురం, వసుంధర, రట్టిణి తదితర గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. ఈ వర్షం మెట్ట ప్రాంతాల్లో ఎండిన పంటలకు ఊపిరి పోసింది. పల్లపు ప్రాంతాల్లో ఉన్న రైతులకు అవస్థల పాలు చేసింది.

వరదనీరు చొరబడకుండా చర్యలు



హడ్డుబంగి గెడ్డ పరిస్థితిపై అధికారులు, స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నీరజ

కొత్తూరు: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొత్తూరులోని హడ్డుబంగి గెడ్డలోకి వదర నీరు చేరింది. గెడ్డలో పేరుకుపోయిన పూడికలను నీటిపారుదలశాఖ అధికారులు తొలగించలేదు. దీంతో గెడ్డకు అనుకొని ఉన్న రెల్లివీధిలోకి వరదనీరు చేరింది. వరదనీటిలో ప్రజలు అవస్థలు పడ్డారు. ఎంపీడీఓ నీరజకు మంగళవారం ఫిర్యాదు చేశారు. హడ్డుబంగి సాగు నీటి గెడ్డను, రెల్లి వీధిలో ఉన్న వరద నీటిని ఎంపీడీఓ పరిశీలించారు. వీధుల్లో నుంచి నీరు ప్రవహించడంతో అంటురోగాలు బారినపడే ప్రమాదం ఉందని రెల్లి వీధికి చెందిన ప్రజలు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. గెడ్డలోని పూడికలు తొలగిస్తామని, గెడ్డపై ఉన్న కల్వర్టు ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. గెడ్డలో ఉన్న చెత్తను తొలగించడంతో రెల్లివీధిలో ఉన్న వరదనీరు తగ్గి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వరదనీరు తగ్గిన వెంటనే పారిశుద్ధ్య పనులు..

రెల్లి వీధిలో వరదనీరు తగ్గిన వెంటనే పారిశుద్ధ్య పనులు చేపడతామని సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు తెలిపారు. వర్షం నీటితో నిండి ఉన్న వీధులను పరిశీలించారు. అంటురోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అసవరమైనచోట బ్లీచింగ్ చల్లాలని వైద్య సిబ్బందికి సూచించారు.

వైద్య శిబిరం ఏర్పాటు..

రెల్లి వీధిలో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురుకి రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ వీధిలో నీరు నిల్వ ఉన్నందున అంటురోగాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈఓ బుజ్జిబాబు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

గొట్టా బ్యారేజీ పరిశీలన



గొట్టా బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు

హిరమండలం: మండంలోని వంశధార గొట్టా బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని ఇన్‌చార్జి ఎస్ఈ కె.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వంశధార అధికారులతో మాట్లాడి బ్యారేజీ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షపాతం నమోదు వివరాలు తెలుసుకున్నారు. వంశధార ఈఈ మురళీమోహన్, డీఈ సరస్వతి, ఏఈలు ధనుంజయరావు, పరిశుద్ధబాబు, గొట్టా బ్యారేజీ సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కొత్తూరు: మండలంలోని మాతల వద్ద అక్రమంగా తరలిస్తున్న 8 పశువులను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.డి.అమీర్ తెలిపారు. పశువులను బలద వారపు సంత నుంచి విశాఖపట్నానికి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నారన్నారు. పశువులను విజయనగరం జిల్లాలోని గుర్ల గోశాలకు అప్పగించామన్నారు. పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న దుద్ది దుర్గారావు, తామడ అప్పారావులపై కేసు నమోదు చేశామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్కెలను నియంత్రణలో ఉంచుకోవాలి



మాట్లాడుతున్న చిదృపానంద సరస్వతి

నరసన్నపేట: కోర్కెలను అదుపు చేసుకోలేక జీవితంలో శాంతిని కోల్పోతున్నారని చిదృపానంద సరస్వతి అన్నారు. స్థానిక చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిత్తిరివీధిలోని ఆశ్రమంలో భగవద్గీతపై ప్రవచనాలను నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. మంగళవారం ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీకి చెందిన చిదృపానంద సరస్వతి ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరై ప్రసంగించారు. చిన్మయ మిషన్ అనేక దేశాల్లో కొన్ని సంవత్సరాలుగా ఆశ్రమాలు ఏర్పాటు చేసి పని చేస్తుందన్నారు. మానవ జీవితంలో మంచిని, ధర్మాన్ని, ఆనందాన్ని నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు. పరమాత్మానంద స్వామిజీ, చిన్మయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి



నరసన్నపేట: లూయిస్ చిత్రపటానికి పూలు వేస్తున్న ఫొటోగ్రాఫర్లు

నరసన్నపేట: ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, 50 ఏళ్లు దాటినవారికి పింఛన్ ఇవ్వాలని సంఘం ప్రతినిధులు ప్రసాద్, తదితరులు కోరారు. మంగళవారం నరసన్నపేటలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే మండేలా చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు గోపి, శ్రీను, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: లూయిస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న భుజంగరావు, సభ్యులు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం..

పాతపట్నం: నియోజకవర్గ కేంద్రంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నియోజకవర్గ ఫొటో గ్రాఫర్ల సంఘం (పీఎన్‌పీడబ్ల్యూఏ) అధ్యక్షుడు తూలుగు భుజంగరావు, సభ్యులు నివాళులర్పించారు. సంఘం సభ్యులు పి.రాము, ఎస్.మరణ, టి.వెంకటరావు, గోపికృష్ణ పట్నాయక్, ఎస్.సాయి, శంకర్, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన మోసాలమయం



కుద్దబలో కూటమి వైఫల్యాలను వివరిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రివిలేజ్ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం మండలంలోని దీనబంధుపురం పంచాయతీ పరిధిలోని కుద్దబ, దీనబంధుపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో, క్యూ ఆర్ కోడ్‌లను ఇంటింటికీ వెళ్లి అందించారు. పలువురు మహిళలు రెడ్డి శాంతి దృష్టికి సమస్యలను తీసుకువచ్చారు. మళ్లీ జగనన్నే రావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, సీనియర్ నాయకులు ఉర్లాన బాలరాజు, జి.ఢిల్లీరావు, సంజీవ్, సీయాకు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల్లో.. వైఎస్సార్‌సీపీ నాయకుల పర్యటన



గుప్పెడుపేటలో స్థానికులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- బాధితులకు అండగా ఉంటామని హామీ

పోలాకి: మండలంలోని మత్స్యకార గ్రామాలైన రాజారాంపురం, రేవు అంపలాం, గుప్పెడుపేటల్లో జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుల బృందం మంగళవారం పర్యటించింది. అల్పపీడనం నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మత్స్యకారుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వేటకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండి అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఇటీవల రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగ పింఛన్‌దారులకు ఇచ్చిన నోటీసులపై స్థానిక నాయకులు కృష్ణచైతన్య దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఈ కుట్రలపై పోరాటం చేస్తామన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న పలువురు పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు కల్లేపల్లి లక్ష్మణరావు, చింతు రాఘవరావు, చింతాడ ఉమామహేశ్వరరావు, లండ యర్రయ్య, నందుపల్లి పైడితాత, తులే పైడమ్మ, కొమర మూర్తి, తదితరులు ఉన్నారు.



రాజారాంపురంలో పింఛన్ బాధితురాలితో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

ఎరువులు ఎప్పుడిస్తారు?

- అధికారులను నిలదీసిన సభ్యులు

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు శాఖల వారిగా నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ, సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయశాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో పాతపట్నం-2 ఎంపీటీసీ సభ్యుడు కొండాల యరకయ్యతోపాటు పలువురు సభ్యులు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలని పదే, పదే చెప్పినా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇటీవల మండలానికి వచ్చిన ఎరువులు ఎక్కడకి వెళ్లాయని నిలదీశారు. ఇంతవరకు రైతులకు యూరియా అందలేదని, ఒడిశా వెళ్లి కొనుగోలు చేస్తున్నారన్నారు.

ఏఓ పి.కిరణ్‌వాణి మాట్లాడుతూ.. మండలంలో వరిసాగు సుమారు 14 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారని, 700 మెట్రిక్ టన్నుల యూరియా కావాలని ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామన్నారు. ఇటీవల మొదటి విడతగా 360 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వచ్చిందని, 18 ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేశామన్నారు. రెండో విడత యూరియా త్వరలోనే రానుందన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని మూడు ఆర్‌బీకేల ద్వారా 40 టన్నుల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. గురండి సర్పంచ్ శిష్టు తులసీనాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల పూర్తిగా శిథిలైమందని, ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో పాఠాలు బోధిస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈఓ గోవిందరావు దీనిపై సమాధానం ఇస్తూ.. నూతన పాఠశాల భవనం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. తిడ్డిమి ఎంపీటీసీ కొప్పల గీత మాట్లాడుతూ.. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం నీరు సూర్యనారాయణపురంలోని ఇళ్లలోకి చొరబడిందన్నారు.

ఫారెస్ట్ అధికారి అజేయ్ మాట్లాడుతూ దీనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీఓ పి.చంద్రకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ జి.శోభారాణి, జేఈ టి.ప్రసాదరావు, ఏపీఓ సురేష్, ఏపీఎం రవిరాజ్, ఏఓ తిరుపతి పట్నాయక్, పశువైద్యురాలు బి.శ్రీవాణి, వైద్యులు శివకుమార్, సత్యవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎరువుల కోసం అధికారులను నిలదీస్తున్న సభ్యులు

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి సూచించారు. పట్టణంలోని మోనింగివారి వీధిలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, రోగులకు అందజేస్తున్న వైద్య సేవలు, సిబ్బంది విధులు, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి పలు సూచనలు చేసారు. హెల్త్ సెంటర్‌లో లభ్యమయ్యే ఔషధాల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, అవసరమైన మందులు నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సెంటర్‌లో ఉన్న అన్ని వార్డులను సందర్శించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు తెలిపిన సమస్యలు, అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని డాక్టర్ బి.సురేష్‌కు సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరావు, మున్సిపల్ రెవెన్యూ బిల్ కలెక్టర్ డి.రవి, ఫార్మాసిస్ట్ చింతాడ వరుణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి